విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శుక్రవారం 11 ఏప్రిల్ 2025 8 పేజీలు

రానున్న ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

– రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని

విశాలాంధ్ర – తిరుపతి కలెక్టరేట్ : రానున్న సంవత్సరంలో పంచాయితీ రాజ్, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాల్సిన ఆవశ్యకత ఉందని, అందు కొరకు ప్రణాళికా బద్ధంగా మాస్టర్ ట్రైనర్ శిక్షణ, మానవ వనరులు, పోలీస్ బలగాలు, ఎలక్టోరల్ రోల్ తదితర అంశాలపై దృష్టి

2

పేరుకే నక్సల్స్ ఏరివేత

- అడవులను కార్పోరేట్‌లకు అప్పగించేందుకే ఈ కుట్ర
- గిరిజన ప్రాంతాలపైనే మీరు గురిపెడతారా.?
- నక్సలిజం భావజాలంతో పోరాటం తప్పుకాదు.. మనుషులను చంపేస్తారా..
- దేశంలో విభిన్న ఆలోచనలు ఉండకూడదా.?
- ఏకపక్షంగా వక్ఫ్ బిల్లును పాస్ చేయడం లౌకిక వ్యవస్థకు చీకటి రోజే
- వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవడం.. ఆర్థికంగా దెబ్బకొట్టేందుకు కుట్రలో భాగమే
- ఇప్పటికే వక్ఫ్ బిల్లుపై సుప్రీంలో చాలెంజ్ చేశాం
- 12న సీపీఐ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతున్నాం
- తిరుపతిలో విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యలు
- పోలీసులపై జగన్ ప్రవర్తన సరికాదని విమర్శ

అడవుల్లో నక్సల్ ఏరివేత ముమ్మాటికీ దుర్మార్గమేనని, భావజాలాన్ని అనచడంలో తప్పుకాదని, మనుషులను చంపడమే పనిగా పెట్టుకోవడం సరైన విధానం కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అభిప్రాయపడ్డారు. తిరుపతి గంధమనేని శివయ్య భవనంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2026కల్లా నక్సల్స్ ను తుదిముట్టిస్తామన్న కేంద్ర హెూం మంత్రి వ్యాఖ్యలు గిరిజన ప్రాంత వాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు.

– వార్త మెయిన్ పేజీలో

వర్క్ షాప్ సూచనలు, సలహాలు సీసీఎల్ఎకి నివేదిస్తాం

– జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

విశాలాంధ్ర – తిరుపతి కలెక్టరేట్ : పీజీఆర్ఎస్ నందు ముఖ్యంగా భూ సంబంధిత రెవెన్యూ, సర్వే అంశాల సమస్యలపై ప్రజల నుండి ఎక్కువ అర్జీలు వస్తున్నాయని, రెవెన్యూ సర్వే శాఖలు అందించే సేవలు ప్రజల సంతృప్తి మేరకు అందిస్తూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ పేర్కొన్నారు. గురువారం తిరుపతి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జేసీ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాలతో కలిసి పలువురు ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా సర్వే అధికారి అరుణ్, తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్ఓ తదితరులకు రెవెన్యూ, సర్వే అంశాలపై వర్క్ షాప్ నిర్వహిం చారు. ఈ వర్క్‌షాప్, ల్యాండ్ అలియనేషన్,

2లో

సుదీర్ఘ పోరాట ఫలితమే..

అగ్రీ ఆస్తుల వేలం!

- సిపిఐ మద్దతుతోనే సాకారం
- అగ్రీ వెంచర్లలోని లబ్ధిదారులకు సత్వరం రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి : డా. టి. జనార్ధన్, బి. శ్రీనివాస్

విశాలాంధ్ర – తిరుపతి: అగ్రిగోల్డ్ బాధితులకు సంస్థ తరఫున జరిగిన తీవ్ర అన్యాయాన్ని నిరసిస్తూ గత 15 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితమే రాష్ట్ర ప్రభుత్వం ఆస్తుల వేలం వేయడం హర్షదా యకమని ఉమ్మడి చిత్తూరు జిల్లా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ టీ.జనార్ధన్, అధ్యక్షులు బెల్లంకొండ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అగ్రిగోల్డ్ బాధితులను సమైక్యం చేయడంలో సిపిఐ ముఖ్యంగా పార్టీ సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరావు సహకాం౦ మరువలేనిదని వారు పేర్కొన్నారు. గతంలో చనిపోయిన బాధితు లకు పరిహారం ఇప్పించ డంతో మొదలైన పోరాటం దశలవారీగా, పదివేల రూపాయలు

2

అగ్రీఆస్థుల వేలం!

(మొదటి పేజీ తరువాయి) లక్షలాది మందికి తదుపరి 20 వేలు చెల్లించిన వారితో కలిపి వెయ్యి కోట్ల వరకు ప్రభుత్వం నుండి లబ్ధిదారులకు చెల్లించేలా అసోసియేషన్ తీవ్రంగా కృషి చేసిందని వారు పేర్కొన్నారు. ఏలూరు ప్రత్యేక కోర్టు సూచన మేరకు నేడు వేలానికి అంగీకరించడం జిల్లాల వారీగా భూముల వివరాలు, వాటి ధరలు నిర్ణయించడంతో సమస్య పరిష్కారానికి మార్గం ఏర్పడిందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అగ్రీ వెంచర్స్‌లో పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించిన వారికి, అగ్రిమెంట్ చేసిన వారందరికీ సంబంధిత స్థలాలు రిజిస్ట్రేషన్ చేయాలని వారు కోరారు. అలాగే రాష్ట్రం లోని బాధితులకు చెల్లించిన సొమ్ము కోర్టు సూచన మేరకు చెల్లించాలని కోరారు. ఈ ఉధ్యమంలో ఎనలేని తోడ్పాటునిచ్చిన రాష్ట్ర అధ్యక్షులు ఇ.వి.నాయుడు, ప్రధాన కార్యదర్శి, తిరుపతి రావు, డిప్యూటీ సెక్రటరీ, చంద్రశేఖర్ రావు, మల్లికార్జున లకు కృతజ్ఞతలు తెలిపారు.

రానున్న ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

(మొదటి పేజీ తరువాయి) సారించి, ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రజా స్వామ్య బద్ధంగా ఎన్నికల నిర్వహణ జరిగేలా ఉండాలని ఆం.ప్ర రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు రానున్న సంవత్సరం మునిసిపల్ ఎన్నికలు, పంచాయితీ రాజ్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై అధికారులకు సూచనలు చేస్తూ, అలాగే అధికారుల సలహాలు సూచనలను కోరుతూ ఆం.ప్ర రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ ఐఏఎస్ (రిటైర్డ్) తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఐఏఎస్ (రిటైర్డ్) తో కలిసి మేథో మథన కార్యక్రమంలో పాల్గొనగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్. జెసి శుభం బన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, డిఆర్ఓ నరసింహులు, పంచాయితీ రాజ్ శాఖ, మునిసిపల్ శాఖ, పోలీస్ శాఖ, రెవెన్యూ తదితర సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆం.ప్ర సిఈసి కమిషనర్ నీలం సాహ్నీ మాట్లాడుతూ రానున్న పంచాయితీ రాజ్, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఈవిఎంల వినియోగంపై పరిశీలిస్తున్నామని, వాటి సాధ్యా సాధ్యలపై అధికారుల సూచనలు సలహాలను ఆహ్వానిస్తూ చర్చించారు. అంతే కాకుండా మాస్టర్ ట్రైనర్ శిక్షణ, భద్రత బలగాలు, మానవ వనరులు, బడ్జెట్ తదితర అంశాలపై ముందస్తు అంచనాలతో ప్రణాళికలు సిద్ధం కావలసి ఉంటుందని ఆం.ప్ర రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ ఐఏఎస్ (రిటైర్డ్) తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఐఏఎస్ (రిటైర్డ్) మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించు కునేలా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పంచాయితీ, మునిసిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధత పై ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వారి సూచనలు ఎంతో విలువైనవి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవి మనోహరాచారి, జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవి, డిప్యూటీ కమిషనర్ తిరుపతి మున్సిపాలిటీ అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్క్ షాప్ సూచనలు, సలహాలు సీసీఎల్ఎకి నివేదిస్తాం

(మొదటి పేజీ తరువాయి) సెక్షన్ 22ఏ, భూముల క్రమబద్ధీకరణ, అసైన్మెంట్, ఆర్ఓఆర్ వెబ్ ల్యాండ్ సమస్యలు, ఫ్రీహోల్డ్, ఇనామ్/ఎస్టేట్ తదితర భూ సంబంధిత, రెవెన్యూ, సర్వే సమస్యలపై సీసీఎల్ఏ ఆదేశాల మేరకు రెవెన్యూ, సర్వే శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి రెవెన్యూ సేవ లు మరింత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, విస్తృతంగా ఎలాంటి భూ వివాద రహితంగా ప్రజలకు ఉత్తమ మైన సేవలు అందించుటకు రెవెన్యూ శాఖలో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించిన నేపథ్యంలో సీసీఎ ల్ఎ నిర్దేశాల మేరకు ప్రస్తుతం ఉన్న జీఓలు, మార్గదర్శకాల స్థానే ఏమైనా అవసరమైన మార్పులు చేర్పుల కొరకు వర్క్ షాప్ నిర్వహించి సూచనలు పంపాలని తెలిపిన నేపథ్యంలో, వర్క్ షాప్ నందు విస్తృతంగా మేథో మథనం ద్వారా పలువు రిచే సూచించ బడిన సూచనలు సలహాలను తీసుకుని సిసిఎల్ఎకి కాన్సాలిడేట్ చేసి పంపునన్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రోజ్ మండ్, సుధారాణి, తిరుపతి, శ్రీకాళహస్తి, ఆర్డీవోలు రామ్‌మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, పలువురు తహసీల్దార్లు, సంబంధిత కలెక్టరేట్ సిబ్బంది, ఆర్ఐ, విఆర్ఓలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంపై సందర్శించిన ఎస్పి మణికంఠ చందోలు

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటినగరం మండలం, గంగమాంబపురం గ్రామంలో గత కొద్ది కాలంగా కొనసాగుతున్న భూ వివాదాల నేపథ్యంలో, జిల్లా ఎస్పీ శ్రీ వి.ఎన్. మణికంఠ చందోలు ఎస్పి గురువారం గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం లోని గంగమాంబపురం గ్రామంలో గత కొంత కాలంగా భూమికి సంబంధించిన వివాదం కొనసాగుతోంది,ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఈరోజు గ్రామాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో సందర్శించి, అక్కడి భూ వివాదానికి సంబంధించి పరిస్థితులను సమీక్షించారు.రెవెన్యు, పోలీసు అధికారులు సిద్ధం చేసిన నివేదికలను పరిశీలించిన ఎస్పీ నివేదికల ప్రకారం న్యాయం చేస్తామని, అక్కడ ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.భూములను ఎవరైనా అక్రమంగా ఆక్రమిస్తే వారిపైన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో ఎవరికైన భూ సమస్యలు ఉంటే సోమవారం

జిల్లా పోలీసు కార్యాలయము నందు జరిగే ప్రజా సమస్యల ఫిర్యాదు కార్యక్రమానికి వచ్చి ఎస్పీ గారికి ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ శ్రీ వి.ఎన్. మణికంఠ చందోలు ఎస్పి తెలిపారు.

నేడు ఒంటిమిట్ట కోదండ రామయ్య కళ్యాణం

ముత్యాల తలంబ్రాలు , ప్రసాద పంపిణీకి 28 కౌంటర్లు

భక్తులకు 70 వేల లడ్డూ ప్రసాదాలు ప్రత్యేక ప్యాకింగ్‌లో సిద్ధమయ్యాయి. శ్రీవారి సేవకులతో ముత్యాల తలంబ్రాలు భక్తులకు అందించేందుకు ఇప్పటికే ప్యాకింగ్ చేశారు, కళ్యాణోత్సవ రోజున ప్రత్యేక కౌంటర్ల ద్వారా అన్నదానాన్ని విస్తృతంగా నిర్వహించనున్నారు. శ్రీరామనవమి నుంచి అన్నదాన కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమైంది. ఆలయం చుట్టూ ప్రత్యేకంగా అలంకరించిన విద్యుత్ దీపాలు దీపావళి వాతావరణాన్ని తలపిస్తున్నాయి.

భద్రత, రవాణా, సౌకర్యాలపై విస్తృత చర్యలు

భక్తుల పెద్దఎత్తున రాకపోకల నేపథ్యంలో, జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, టిటిడి, ఆర్టీసీ, విద్యుత్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తు న్నాయి. దాదాపు 3000మంది పోలీసులు విధుల్లో నిమగ్నమవ్వగా, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేశారు. కడప నుండి తిరుపతి వైపు వెళ్లే వాహనాలను సాయి నగర్, బాపనపల్లి, గంగ పేరూరు, రాచపల్లి మీదుగా మళ్లిస్తు న్నారు. రాజం పేట వైపు నుంచి వచ్చే వాహనాలను కూడా మలకాటి పల్లె, రాచపల్లి మార్గాల ద్వారా మళ్లించనున్నారు.

విద్యుత్ అంతరాయాలు లేకుండా ప్రత్యేక చర్యలు

బ్రహ్మోత్సవాల సమయంలో విద్యుత్ అంతరాయా లు తలెత్తకుండా ఉండేం దుకు విద్యుత్ శాఖ ప్రత్యేక బృందా లను నియమించింది. అవసరమైన చోట అదనపు జనరేటర్లు, బ్యాకప్ లైట్లు సిద్ధంగా ఉంచారు. కళ్యాణ వేదిక, ఆలయ ప్రాంగణం, ఎల్ఈడి స్క్రీన్ లు, ట్రాఫిక్ నియంత్రణ కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక సిబ్బంది రౌండ్ ది క్లాక్ విధుల్లో ఉన్నారు.

విశాలాంధ్ర- తిరుపతి : రెండో అయోధ్య గా విరాజిల్లుతున్న ఒంటిమిట్టలో జరగుతు న్న శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మో త్సవాలు ఆధ్యాత్మిక వైభవంతో కొనసాగు తున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రధానంగా ఏప్రిల్ 11న నిర్వహించనున్న శ్రీ సీతారా ముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

విశేష వసతులు

- కల్యాణ వీక్షణం అందరికీ అందుబాటులో

భక్తులు నిరవధికంగా కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు కళ్యాణ వేదిక వద్ద 147 గ్యాలరీలు, 23 పెద్ద ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్యాలరీకి ప్రత్యేక అధికారిని నియమించి భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా చేశారు. 130 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఉచిత బస్సుల ద్వారా మలకాటి పల్లె, ఇతర పార్కింగ్ ప్రాంతాల నుండి భక్తులను వేదికకు చేర్చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తాత్కాలిక మరుగుదొడ్లు, శుద్ధి జల పంపిణీ కేంద్రాలు, మజ్జిగ ప్యాకెట్లు, వైద్య శిబిరాలు అందుబాటులో ఉన్నాయి.

సహకారంతో ముందుకు

- సమన్వయంతో విజయవంతం

టిటిడి, జిల్లా యంత్రాంగం, స్థానిక వాలంటీర్లు, సిబ్బంది పూర్తి సమన్వయంతో పని చేస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడడమే లక్ష్యంగా ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టారు.

భక్తులు ముందస్తుగా రావడం, సూచించిన మార్గాలను అనుసరించడం ద్వారా వేడుకలను ప్రశాంతంగా అనుభవించవచ్చని అధికారులు విజ్ఞప్తి చేశారు. టిటిడి, జిల్లా యంత్రాంగం, స్థానిక వాలంటీర్లు, సిబ్బంది పూర్తి సమన్వయంతో పని చేస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడడమే లక్ష్యంగా ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టారు.

హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు సాధనకు సన్నద్ధం కండి: ఏఐటీయుసి

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెరగాలి

ఇండ్లు లేని హమాలీ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి : ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించాలి

విశాలాంధ్ర - తిరుపతి: హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి సమావేశం బైరాగి పట్టణంలో గల ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి హమాలీ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ డి రవి అధ్యక్షత వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి రాధాకృష్ణులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీరేట్లు పెరగాలని. ప్రభుత్వం హమాలీ కార్మికులను ఆదుకోవడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని ఈ సంక్షేమ చట్టంలో 45 సంవత్సంములు పైబడిన వారందరికీ కేరళ ప్రభుత్వ తరహాలో 6 వేల రూపాయల పింఛన్ సౌకర్యం కల్పించాలని.. అందరికీ ఈఎస్ఐ సౌకర్యం పిఎఫ్ సౌకర్యం కల్పించాలని. గ్రూప్ ఇన్సూరెన్స్ పది లక్షల రూపాయలు కల్పించాలని ఇల్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఆర్థికంగా సహాయ సహకారాలు అందించాలని వారు డిమాండ్ చేశారు అలాగే తిరుపతి నగర మహాసభలకు హమాలీ కార్మికులను సన్నద్ధం కావాలని మే చివరన కానీ జూన్ మొదటి వారంలో కానీ తిరుపతి నగర హమాలీ వర్కర్స్ యూనియన్ నగర మహాసభలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది అలాగే ఈ మే 20వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలు హ మాలి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. ఇంకా ఈ సమావేశంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బాబు నాగరాజు శ్రీనివాసులు సిహెచ్ శివకుమార్ సుబ్రహ్మణ్యం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోషణ పక్వాడను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : పిల్లు, గర్భిణిలు, బాలింతల్లో రక్తహీనత తొలగించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ పక్వాడను సద్వినియోగం చేసుకోవాలని సూపర్వైజర్స్ మంజుల రేవతి కోరారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీకాళహస్తి మండలంలో పలు గ్రామాలలో కార్యక్రమాలు నిర్వహించారు అందులో కలవకుంట, సుబ్బానాయుడుకండ్రిగ గ్రామంలో సూపర్వైజర్స్ మంజుల రేవతి, అంగన్వాడి కార్యకర్తలు ఏఎన్ఎం ఆషా లు, గర్భిణీలు బాలింతరకు పోస్టాహారం యొక్క ప్రాముఖ్యత, బిడ్డ మొదటి 1000 రోజుల యొక్క ప్రాముఖ్యత, పోషన్ ట్రాకర్ ఆప్ ఏ విధంగా ఉపయోగించుకోవాలి, పోషకాహార లోపంతో ఉండే పిల్లలను ఎలా సంరక్షించాలి అనే విషయాన్ని తెలియజేశారు. పోషణ్ అభియాన్ అనేది పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులకు పోషకాహార ఫలితాలను మెరుగుపరచడానికి ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. పిల్లల్లో వచ్చే రక్తహీనతను పోగొట్టేందుకు పోషకాలతో కూడిన పదార్థాలను సక్రమంగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఏఎన్ఎం ఆషా లు, బాలింతలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

12న జీ తెలుగులో డ్రామా జూనియర్స్ సీజన్ 8

విశాలాంధ్ర - తిరుపతి: జీ తెలుగు డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ 8 ఈ నెల 12న ప్రారంభం కానుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సంవత్సరాల నుంచి ప్రేక్షకులు హృదయాలను గెలుచుకున్న డ్రామా జూనియర్స్ 8వ సీజన్‌తో మరోసారి ప్రేక్షకులకు వినోదం పంచేందుకు సిద్ధమైందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పిల్లల్లో దాగున్న నటనా ప్రతిభను వెలికి తీసే ఉద్దేశ్యంతో కొత్త సీజన్ని ప్రారంభిస్తోందన్నారు. ఈ షోకు ఎనర్జిటిక్ యాంకర్ సుధీర్ హోస్ట్ చేయనుండగా, ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి, నటి రోజా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. అనిల్ రావిపుడి జీ తెలుగు డ్రామా జూనియర్స్ 8 షో ద్వారా బుల్లితెరపై మొదటిసారిగా న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. డ్రామా జూనియర్స్ సీజన్ 8 గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్ ముఖ్య అతిథులుగా ప్రముఖ నటులు జగపతి బాబు, ఆమని హాజరవుతారు. ఈ సీజన్లో పాల్గొనే చిన్నారులు రెండు జట్లు బాయ్స్ టీమ్, గర్ల్స్ టీమ్‌గా తలపడనున్నారు. గర్ల్స్ టీమ్‌కి యాంకర్ లాస్య, బాయ్స్ టీమ్ కి త్రినయని సీరియల్‌తో జీ తెలుగు ప్రేక్షకులను అలరించిన నయని మెంటర్లుగా వ్యవహరిస్తున్నారు..

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వ రాల యంలో గురుదక్షిణా మూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనసేనచే పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి వినుత కోట ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ బస్టాండు కూడలిలో పేదలకు అన్నదానం చేశారు. ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ స్ఫూర్తితో శ్రీకాళహస్తిలో ప్రతి గురువారం మధ్యాహ్నం బస్టాండ్ సెంటర్లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 39వ వారం ఆర్టీసీ బస్టాండు వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల ఇంచార్జి పేట చంద్రశేఖర్, విశ్రాంత తహసీల్దారు చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పేట చిరంజీవి, వెంకటరమణ యాదవ్, దినేష్, సురేష్, లక్ష్మణ్, మునిచంద్ర, దినేష్ సాయి, చందు, నవీన్, వెంకటయ్య, రాజా, వీర మహిళలు లక్ష్మి, రాజ్యలక్ష్మి, శారద, గాయత్రి, బత్తెమ్మ పాల్గొన్నారు.

టిడిపిపై అసత్య ప్రచారం తగదు

విశాలాంధ్ర - పాకాల : తెలుగుదేశం పార్టీపై చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని మండల టిడిపి నాయకులు హితవు పలికారు. గురువారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల టిడిపి నాయకులు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రగిరి మాజీ శాసనసభ్యులు చెవి రెడ్డి భాస్కర్ రెడ్డి టిడిపి నాయకులు పాకాల జడ్పిటిసి భర్త ,వారి కుమారుడి పై దాడి చేసి, బట్టలు చింపి, వారి కారు అద్దాలు పగలగొట్టడంతోపాటు వారిని పోలీస్ స్టేషన్లో చితకబాదిం చినట్లు తన బ్లూ మీడియా , తమ సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు రాయిం చారని పేర్కొన్నారు. ఇవి పూర్తిగా నిరాధారమైనవని, ఆధారాలు ఉంటే చూపాలని సవాల్ విసిరారు. ఇటువంటి తప్పుడు వార్తలను ప్రచారం చేసి తెలుగుదేశం పార్టీ లోని నాయకుల మధ్య ఐక్యతను దెబ్బతీయాలని కుట్ర రాజకీయాలు చేస్తున్నారని ఇలాంటి చౌక్ భారీ ప్రయత్నాలు మానుకోవాలన్నారు. తమ పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం తమ సంస్కృతి కాదన్నారు. చెవిరెడ్డి నియంత ధోరణి ఆయన నైజం నచ్చకనే జడ్పిటిసి ఎన్నికల మునుపు టిడిపి పార్టీలో చేరారని తమ పార్టీలో వారికి సముచిత గౌరవం ఇస్తున్నట్లు తెలియజేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధితో తమ ఎమ్మెల్యే పులివర్తి నానికి , తమ పార్టీకి పెరుగుతున్న ప్రజాధారణ చూసి ఓర్వలేక చెవిరెడ్డి ఇలా విష ప్రచారం చేస్తున్నారన్నారు. ఆయన ఎన్ని చేసినా తెలుగుదేశం పార్టీని బలహీనపరచలేరని ఇకనైనా ఇటువంటి చౌకబారు పనులు మానుకోవాలని హితవు పలికారు . ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నాగరాజు నాయుడు ప్రధాన కార్యదర్శి పల్గుణ కుమార్ నాయకులు ఈశ్వర్ చౌదరి, ప్రవీణ్ , మోహన్ , రంజిత్ , గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఐఎన్‌టీఎస్‌వో పరీక్షల్లో పట్టణం లోని శ్రీరామ్‌నగర్ కాలనీలో గల శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇటీవల లెవల్ %-%1లో గెలుపొందిన విద్యార్థులు లెవల్%-%2 పరీక్షలు రాయగా అందులో లేఖనసాయి మొదటి బహుమతి సాధించి లెనోవా ట్యాబ్‌ను బహుమతిగా అందుకుంది. మోక్షిత రెండవ బహుమతి, దాలిత్య 3వ బహుమతి, మోనాలిక 4గవ బహుమతి, రిక్షిత్, చేతన 5వ బహుమతి పొదారు. వీరిని కళాశాల ప్రిన్సిపా రూపాదేవి, ఏజీఎం సురేష్ అభినందించారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడానికి నిర్వహించే పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జులు త్రివేణి, కల్పన, డీన్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనకాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణ శివారులో రాజీవ్ నగర్ లో గల గిరిజన కాలనీలో తాగునీటి సమస్యను శుక్రవారం పరిష్కరించారు. గిరిజనకాలనీలో చాలా కాలంగా తాగునీటి సమస్య ఉంది. స్థానికులు ఈ సమస్యను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని పురపాలక శాఖ అధికారులను ఆదేశిం చారు. దీంతో వారు రాజీవ్ నగర్ లో గల గిరిజన కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ...రెండు నెలల కిందట రాజీవ్ నగర్ లో రెండు బోర్లు కూడా వేశామన్నారు. త్వరలో రాజీవ్ నగర్ లోమౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శేఖర్, రాజీవ్ నగర్ కాలనీ వీఆర్వో సుగుణ, రాజీవ్ నగర్ వాసులు గురవయ్య ,సురేష్, అమరావతి, తులసమ్మ, అరుణ్, శివ,చెంచయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-గూడూరు: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్.ఎం.యు.ఏ నాయకులు కోరారు. గురువారం గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఎన్.ఎం.యు.ఏ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1/19 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ప్రమోషన్‌లు ఇవ్వాలన్నారు. మహిళలకు అవసమైనప్పుడు సెలవులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ అసిస్టెంట్ సెక్రటరీ అహ్మద్, డిపో ప్రెసిడెంట్ ప్రవీణ్, సెక్రటరీ శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ, గ్యారేజి సెక్రటరీ ప్రవీణ్, ట్రెజర్ గౌస్, రాజేష్, శేఖర్, అచ్యుత రావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల చిరకాల వాంఛ తీరింది

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలం తీర్థం పంచాయతీ దేవ దొడ్డి, గడ్డురు, దాసర్లపల్లి పరిసర ప్రాంతాలలోని ప్రజల చిరకాల వాంఛ తీరింది. ఎన్నికల వాగ్దానాలలో భాగంగా ఈ పంచాయతీల పరిసర ప్రాంతాలలోని ప్రజలకు శాసనసభ్యులు ఎన్ అమర్నాథ్ రెడ్డి ఇచ్చిన హామీలలో ఒకటి అయినా పలమనేర్ టు తీర్థం బస్సును ఏర్పాటు చేయడం జరిగినది. ఈ పరిసర ప్రాంత ప్రజలు అనేక సంవత్సరాల నుండి బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడేవారు. అందరూ ద్విచక్ర వాహన స్తోమత లేని సమయంలో కూడా నడకదారిలో దేవ దొడ్డికి వచ్చి బస్సులను ఎక్కేవారు. దీన్ని కిషోర్ గౌడ్ ద్వారా తెలుసుకొని అప్పటి ఎన్నికల వాగ్దానాలలో చేర్చడం జరిగినది. ఈరోజు సాయంత్రం నాలుగు గంటల 30 నిమిషాలకు పలమనేరు నుండి బైరెడ్డిపల్లి,దేవదొడ్డి, తీర్థం, గడ్డురు, దాసర్లపల్లి, (కర్ణాటక బార్డర్) వరకు తీర్థం నుండి బస్సును శాసనసభ్యులు జండా ఊపి ప్రారంభోత్సవం చేశారు. ఇదే క్రమంలో తీర్థం పంచాయతీలోని 130 మంది లబ్ధిదారులకు ఇంటి నివేశస్థల పట్టాలను పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ అంచలంచనుగా నియోజకవర్గ ప్రజలకు చేసిన హామీలను నెరవేర్చుతామని తెలియజేశారు. ప్రజలు ఆర్టీసీని ఆదరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం సెట్టి పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్ స్వామి, అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీనారాయణ, మండల రెవెన్యూ అధికారి మాధవరాజు, లతోపాటు మండల తెలుగుదేశం నాయకులు మంజునాథ్ రెడ్డి, వేణు, చంద్ర, వెంకటరమణ, విశ్వనాథ్ రెడ్డి, గోవిందస్వామి, రమేష్, శ్రీనివాసమూర్తి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫల సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో ఉన్న రోటరీ భవనంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెల జరిగే హెల్పేజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 25 మంది నిరు పేద వృద్ధులకు, ఫలసరుకులు ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు రోటేరియన్ శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి రోటేరియన్ జి.జి.నాయుడు, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్స్ బి.దశరధరామిరెడ్డి, బి.మయూరి శ్యామ్ యాదవ్, బి.రాంప్రసాద్,టీ.వి. రవికుమార్, బలరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య లేకుండా చూడాలి: ఎమ్మెల్యే నాని

ఓవర్ హెడ్ ట్యాంకును వాడుకలోకి తీసుకురండి
అధికారులకు ఎమ్మెల్యే పులివర్తి నాని సూచన

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలని, అందుకోసం అవసరమైతే కార్పొరేషన్ ఆధీనంలోని ఓవర్ హెడ్ ట్యాంకును వాడుకలోకి తీసుకురావాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూచించారు. గురువారం వేదాంతపురం వద్దనున్న ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించిన ఆయన ట్యాంకును శుభ్రంగా కడిగించి బోరు బావుల ద్వారా దానికి నీటి నింపాలని, అక్కడ నుంచి పైపులైన్ల ద్వారా పంచాయతీలకు నీరు పంపించే ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన చేయాలన్నారు. ఎండ తీవ్రతను పరిగణలోకి తీసుకుని శ్రీనివాసపురం, పద్మావతీపురం, ఓటేరు, అవిలాల, వేదాంతపురం, గాంధీ పురం పంచాయతీలకు ఇక్కడ నుంచి అదనంగా నీరు అందించాలన్నారు. వేదాంతపురం పంచాయతీలో మరో రెండు బోర్లు వేసి నీటి సమస్య రాకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఇప్పటి వరకు నీటి సమస్య అధికంగా వస్తున్న గ్రామ పంచాయతీల వివరాలను ఎంపీడీవో ద్వారా తెలుసుకున్న ఆయన ప్రత్యామ్నాయ చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా తాగునీటి విషయంలో సర్పంచ్, ఎంపీటీసీలు అడిగిన ప్రతి పనిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్ లకు సహకరించి ఎక్కడా నీటి సమస్య రాకుండా చూడాలని స్పష్టమైన ఆదేశాలు అందరికీ పంపించాలన్నారు. వైసీపీకి చెందిన కొందరు సర్పంచ్ లు ఎమ్మెల్యే నానితో కలసి ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించి అక్కడ నుంచి తమ పంచాయతీలకు నీరు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని అభ్యర్థించారు. దీనికి ఆయన కూడా సానుకూలంగా స్పందించారు.

ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

విశాలాంధ్ర-గూడూరు: ముదిరాజ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముదిరాజ్ విభాగం అధ్యక్షులు కోమటి విష్ణు వర్ధన్ ముదిరాజు పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర పర్యటనలో భాగంగా నాయుడుపేట నుంచి నెల్లూరు వెళ్తున్నారని తెలుసుకొని మార్గ మధ్యలో గూడూరు హైవే వద్ద కోమటి విష్ణు వర్ధన్ ముదిరాజ్‌ను మర్యాదపూర్వకంగా గూడూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ ప్రస్తుత వైసీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజులు రాజకీయంగా, ఆర్థికంగా, విద్య పరంగా, వెనకబడి వున్నామని పేర్కొన్నారు. మన ముదిరాజ్ బిడ్డలను బాగా చదివించి వారి బంగారు భవితకు పూల బాటలు వేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బోనం శేషగిరిరావు ముదిరాజ్, పాము రవికుమార్ ముదిరాజు, పెరుమాళ్ళ వీరన్న ముదిరాజ్, మనిమేల రాజేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

టెంపో లారీ ఢీకొని రైల్వే కూలి మృతి

విశాలాంధ్ర-తడ: మండల పరిధిలోని కారూరు మిట్ట వద్ద జాతీయ రహదారిపై టెంపో లారీ ఢీకొని రైల్వే లో కూలీ పని చేస్తున్న సుబ్రమణి 50 మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. తడ ఎస్ఐ కొండప నాయుడు సమాచారం మేరకు తమిళనాడు పరిధిలోని చెన్నై రెడ్ హిల్స్ కు చెందిన సుబ్రమణి గత నెల రోజులుగా కారూరు పంచాయతీ ఖాసీం గాడు కుప్పం వద్ద రైల్వే కూలీ పనులు చేస్తున్నారని బుధవారం రాత్రి వంట సామాగ్రి కొనేందుకు కారురు మిట్టకు వచ్చి వంట సామాగ్రి కొనుక్కొని రోడ్డు దాటుతుండగా చెన్నై నుండి నెల్లూరు వైపు వచ్చే కంటైనర్ లారీ అతి వేగంగా ఢీకొట్టడంతో సుబ్రమణి తలకు తీవ్ర గాయాలు పాలై అక్కడికక్కడే మృతి చెందాడని మృతుని కుమారుడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పార్టీ సభ్యత్వ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర-రామకుప్పం: తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి కార్డులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి మరియు ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి లు గురువారం ఆ పార్టీ బూత్ కన్వీనర్‌లకు అందజేశారు. మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సభ్యత్వ గుర్తింపు కార్డులను లబ్ధిదారులకు అందజేసి దీంతో ప్రతి ఒక్క కార్యకర్తను గుర్తించి వారి సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆదేశించడం జరిగిందని అదేవిధంగా కార్యకర్తలే పార్టీకి అండదండలని వారి సమస్యలను గుర్తించి అధికారుల సమన్వయతో పరిష్కరించాలని సూచించారన్నారు రాష్ట్ర ప్రభుత్వం 9 నెలల పాలన లో చేసిన అభివృద్ధి సంక్షేమలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ రెడ్డి, సీతాపతి, చిన్నకృష్ణ, చలపతి, విజయ్ కుమార్ రెడ్డి, మహమ్మద్ రఫీ, బాలు, సుబ్బి, తదితరులు పాల్గొన్నారు.

యాక్సిడెంట్ జోన్‌లో మరో యాక్సిడెంట్ అవసరమా?

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కమ్మనపల్లి పంచాయతీకి చెందిన జాలారిపల్లి బస్ స్టాప్ సమీపంలో ఉన్నటువంటి నేషనల్ హైవే పై డ్యాము కూలడానికి సిద్ధంగా ఉన్నది. ఇది నేషనల్ హైవే 42 కుప్పం నుండి తిరుపతి వరకు కనెక్ట్ అయి ఉంటుంది. అటు హైదరాబాదు విజయవాడ కడప ఒరిస్సా ఇటు తెలంగాణ నుండి అనేక వాహనాలు ఈ రోడ్డు గుండా కేరళ,తమిళనాడు వరకు ప్రయాణిస్తూ ఉంటాయి. అతి భారీ వాహనాలు సైతం ఈ రోడ్డు వెంబడి ప్రయాణించడం జరుగుతున్నది. గతంలో ఈ ప్రదేశం యాక్సిడెంట్ జోన్ గా గుర్తించడం జరిగినది. ఇక్కడ అనేక భారీ ప్రమాదాలు జరిగి ఉన్నాయి,అదే ప్రదేశంలో ఇలాంటి డ్యామ్ వలన ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు తెలియజేస్తున్నారు. చేతులు కాలిన తర్వాత ఆకులు వెతుక్కో కుండా ముందు జాగ్రత్త చర్యగా డ్యామును పునర్నిర్మించినట్లయితే ప్రమాదం నుండి గట్టెక్కినట్లు అవుతుంది.

30వ రోజుకు చేరిన నిరాహార దీక్ష

టీడీపీ సంఘీభావం

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సిపిఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, నాయకత్వంలో ఇంటి స్థలాల పోరాట రిలే నిరాహార దీక్ష గురువారం 30 వ రోజుకు చేరుకుంది. ఈ నిరాహార దీక్షకు టిడిపి మాజీ గ్రంథాలయ చైర్మన్ తుమ్మల కన్నయ్య నాయుడు సంఘీభావం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన సమస్యకు మీరు పోరాటం చేస్తున్నారు, ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి జిల్లా అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తారని వారికి భరోసా ఇచ్చారు. గ్రామంలో ఉమ్మడి కుటుంబాలతో జీవితాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి.వేరు కాపురం తో ఉండాలంటే ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు, కణమనంబేడు రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెంబర్ లో 252, 253, 254 ఉన్న భూమి ఆక్రమణకు గురైంది. గ్రామంలో ఉన్న నిరుపేదలకు అర్హులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని గత నాలుగు నెలలుగా సిపిఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహించడం సరైన ఆలోచన కాదని వేదన చెందారు. అధికారుల స్పందించి ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట కమిటీ సభ్యులు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

రైలు నుండి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-తడ: తడ మండల పరిధిలోని అక్కంపేట సూళ్లూరుపేట మధ్య రైలు నుండి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. సూళ్లూరుపేట రైల్వే అధికారి శ్రీనివాసరావు సమాచారం మేరకు సూళ్లూరుపేట అక్కంపేట మధ్య దిగువ మార్గంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో వెళ్లి పరిశీలించగా సుమారు 30 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని మృతుడు నీలం రంగు డిజైన్ ఫుల్ షర్టు నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడని మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రి మార్చురుకి తరలించామని ఎవరికైనా ఆచూకీ తెలిసినచో ఈ క్రింది ఫోన్ నెంబర్ 9573245266, 7036043535 కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

చేబ్రోలు కిరణ్‌ను అరెస్టు చేయాలి

వైకాపా నాయకులు పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి భారతి పై చేసిన వ్యాఖ్యలపై చేబ్రోలు కిరణ్ అరెస్ట్ చేయాలని వైఎస్ఆర్సిపి నాయకులు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు వేలూరు రాకేష్, మండల పార్టీ అధ్యక్షుడు మణి నాయుడు అధ్యక్షతన లు మాట్లాడుతూ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్ లో కిరణ్ చేబ్రోలు అనే ఐటీడీపీ కార్యకర్త భారతి పై చేసిన అతి జుగుప్సకరమైన వ్యాఖ్యల మీద ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వేలూరు రాకేష్ మాట్లాడుతూ నేటి సమాజంలో కూటమి ప్రభుత్వం సంబంధించిన నాయకులు స్త్రీల సమాజం తల దించుకునే విధంగా అసభ్య పదజాలం వాడడం హేయమైనచర్య అన్నారు. రాష్ట్రంలో ఉన్న మహిళలందరూ తలదించుకునే విధంగా చేశారు, కోటమ ప్రభుత్వం మహిళలపై చెప్పే మాటలకి చేతలకి సంబంధం లేదు కోటను ప్రభుత్వం పాలనలోనికి వచ్చాక ఆడవారికి భద్రత లేకుండా పోయిందన్నారు ఇది కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటని వెల్లడించారు. ఇలాంటి పదజాలాలు వాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి ఇలాంటి వ్యాఖ్యలు ఎవరు చేసిన వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు అలా కాకుండా చేబ్రోలు కిరణ్ నామమాత్రముగా అరెస్టు చేసి చేతులు దులుపుకోవడం భావ్యం కాదన్నారు, కూటమి ప్రభుత్వమే దగ్గరుండి మాజీ ముఖ్యమంత్రి సతీమణిపై ఇలాంటి మాటలు మాట్లాడటం సమాజంలో మహిళకు గౌరవం ఎక్కడ వస్తుందన్నారు. ఘటనకు సంబంధించిన సాక్ష్యాధారాలు సమర్పించిన నేపథ్యంలో వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయమని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, రవి రెడ్డి, ప్రసాద్ పాల్, మాజీ సర్పంచ్ గురవయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపిపిజిసెట్-2025 ఆన్లైన్ దరఖాస్తుల ప్రారంభం

విశాలాంధ్ర-తిరుపతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఏపిపిజి సెట్ - 2025 నిర్వహణ బాధ్యత లను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాల యానికి అప్పగించిన విషయం విదితమే. కాగా మార్చి 31వ తేదీన ఏపిపిజిసెట్ - 2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఏప్రిల్ 2వ తేదీన ఆన్లైన్ దరఖాస్తులు ఆరంభమైనాయి. ఈ సందర్భంగా యస్వీయూ ఉపకులపతి ఆచార్య అప్పారావు, ఏపిపిజిసెట్ కన్వీనర్ ఆచార్య పి. సి. వెంకటేశ్వర్లు, కో- కన్వీనర్ ఆచార్య కె.సురేంద్ర బాబు గురువారం ఉదయం ప్రెస్ మీట్ నిర్వహించారు. యస్వీయూ ఉపకులపతి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడారు. వి.సి.మాట్లాడుతూ తొలిసారిగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఏపిపిజిసెట్-2025 నిర్వహించే బాధ్యతను ఉన్నత విద్యామండలి అప్పగించిందని, ఈ సారి ఎం.ఏ,ఎం.కామ్., ఎం.ఎస్సీ. వంటి పి.జి. కోర్సుల్లో విద్యార్థులు ఎక్కువగా చేరే విధంగా ప్రణాళికలు సిద్ధంగా వున్నాయని అన్నారు.ఆన్లైన్ దరఖాస్తులను విద్యార్థులు అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 2 నుండి మార్చి 5 వరకు (ఓసి-850/బిసి-750/ ఎస్సీ, ఎస్టీ-650 రూపాయలు)వరకు పంపవచ్చని,వివిధ రకాల అపరాధ రుసుముతో మార్చి 25 వరకు అప్లై చేసుకునే అవకాశం వుందన్నారు. ఈ ఎంట్రన్స్ పరీక్ష 153 కోర్సుల్లో చేరడానికి 31 పరీక్షలను జూన్ 9 నుండి జూన్ 13 వరకు మూడు సెషన్స్ లలో నిర్వహిస్తారని, 13 పాత జిల్లా కేంద్రాలను ఆధారంగా దాదాపు 35 పరీక్ష కేంద్రాలలో పరీక్ష జరుగుతుందని వారు వివరించారు. రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో ఆర్ట్స్, కామర్స్, ఎడ్యుకేషన్, సైన్సెస్ లలో 30,534 సీట్లకు పిజిసెట్-2025 నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సారి అడ్మిషన్లలో పి.జి. విద్యార్థులు బాగా చేరుతారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపిపిజిసెట్ కార్యాలయ సిబ్బంది, ఏపిఆన్లైన్ సహాయకులు పాల్గొన్నారు.

శ్రీ సుందరసిద్ధి వినాయక ఆలయంలో

కన్నులపండువగా కుంభాభిషేక వేడుకలు

కుంభాభిషేకంలో పాల్గొని స్వామివారికి పూజలు చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల ప్రాంగణంలో వెలసిన శ్రీసుందర సిద్దివినాయక ఆలయంలో గురువారం కన్నుల పండుగ కుంభాభిషేక వేడుకలు జరిగింది. శ్రీసుందర సిద్ది వినాయక ఆలయం నిర్మించి 14 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంతో పాటు కొత్తగా గోపురం, స్వామివారికి వెండి కవచం, కలశ నిర్మాణం వంటి పనులను ప్రస్తుతం పూర్తిచేశారుఈ క్రమంలో ఆలయ నిర్వాహకులు కుంభాభిషేక మహోత్సవాలను నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కుంభాభిషేక మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా రుత్వికులు కుంభాభిషేక ప్రక్రియను ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆదిమూలం, ఆసుపత్రి కమిటీ సభ్యులు, దాతలకు నిర్వాహకులు సాలువ కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించి రిత్వికులు ఆశీర్వదించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యులు హేమభూషణం, దనేష్ కుమార్, శోభ తదితరుల పర్యవేక్షణలో ఘమ్ గణపతియే నమః అంటూ వందలాదిమంది భక్తుల నామస్మరణాల, మంగళ వాయిద్యాలు మారుమోగుతుండగా రుత్వికులు గణేష్ శర్మ, సుధాకర్ శర్మ, బాలసుబ్రమణ్యం శర్మ, నవీన్ కుమార్ శర్మ బృందం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమగుండంలో పూజలు జరిపిన 24 కళాశ జలాలతో ఆలయ శిఖర గోపురాలకు పూజలు నిర్వహించి కుంభాభిషేకం జరిపారు. అంతకు మునుపు కుంభాభిషేక వేడుకలను పురస్కరించుకుని గురువారం ఉదయం గణపతి పూజ, కలశ ఆవాహనం, సిద్ది బుద్ది సమేత పూజలు, నక్షత్రాల పూజ, నవగ్రహ పూజ నిర్వహించారు. అనంతరం మూలవిరాట్ సిద్దివినాయకస్వామి వారిని వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. కాగా దాతలు తేజస్విని, ఉషారాణి, శ్రీనాథ్ ఆచారి, యమున, చెంచుబాబు తదితరులు ఆర్థిక సహకారం దాదాపు ఆరున్నర లక్షల రూపాయల వ్యయంతో సిద్దివినాయక ఆలయంలో శిఖరగోపురం, స్వామి వారికి వెండి కవచం, కలశాన్ని నూతనంగా నిర్మించారు.కుంభాభిషేకం వేడుకల్లో అసంఖ్యాక భక్తులు పాల్గొని సిద్ది వినాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోనే నాయుడు మెస్ అధినేత సంతోష్ కుమార్ ఉభయ దాతగా వ్యవహరించి భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కుంభాభిషేక వేడుకల్లో ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల వైద్యాధికారి సురేష్, టిడిపి మాజీ మండల అధ్యక్షుడు పరమశివం, శివానందం, శశిమోహన్ నాయుడు, ఎంపిటిసి బాల సుందరం రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకటేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న బీటెక్ విద్యార్థికి యుటిఎఫ్ చేయూత

విశాలాంధ్ర-తడ: మండలం పరిధిలోని కొండూరు గ్రామ దళిత వాడకు చెందిన విద్యా కుసుమం మీంజూరు దినేష్ బీటెక్ జె ఎన్ టి యు అనంతపూర్ లో చదువుతూ గత కొన్ని నెలలుగా గుండె మరియు ఊపిరితిత్తుల సమస్య తో బాధపడుతున్న విద్యార్థికి యుటిఎఫ్ శాఖ ద్వారా గురువారం విద్యార్థి తల్లిదండ్రులకు నగదు చేయుత అందించారు. బీటెక్ విద్యార్థి దినేష్ అనారోగ్యం తో చెన్నై లోని విజయ హాస్పిటల్, అపోలో హాస్పిటల్ కు పలుమార్లు తీసుకువెళ్లి చికిత్స అందించగా,చివరకు గుండె రీప్లేస్మెంట్ చేయవలసిన పరిస్థితి రావడంతో అందుకు సుమారు 60 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలపడం తో విద్యార్థి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. రోజువారి కూలి పనులు చేసుకునే పేద కుటుంబం కావడంతో దాతల కోసం ఎదురు చూస్తూ తమ బిడ్డను కాపాడమని ప్రాదేయపడటం తో స్థానిక గ్రామానికి చెందిన తడ సిఆర్ఎంటి గోపి యుటిఎఫ్ నాయకులు ను అభ్యర్థించడం తో యుటిఎఫ్ ప్రాంతీయ మండలాల ద్వారా సాయం కోరిన మేరకు యుటిఎఫ్ నాయకులు సామాజిక స్పృహ తో సభ్యులు తమకు తోచిన సహాయం ఆ కుటుంబం నకు చేయగలరని పిలుపునివ్వడంతో, తడ, సూళ్లూరుపేట, దొరవారి సత్రం యుటిఎఫ్ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు 71 మంది సాయం చేయగా సుమారు రూ.55 వేలు సమీకరించి యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె ఎం ఎస్ సునీల మరియు యు టి ఎఫ్ తిరుపతి జిల్లా కార్యదర్శి కె ప్రభాకర్ గారి చేతుల మీదుగా వారి తల్లి తండ్రులకు సదరు మొత్తం ను అందజేశారు. ఈ కార్య క్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం వెంకటేశ్వర్లు, ఎన్ రవికుమార్, కె సుధాకర్, ఎన్ రామమూర్తి, డి కుమారి కిరణ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మే డే ను ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-చిత్తూరు: కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఏఐటియుసి నేతలు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శుల సమావేశం ఎస్టియు కార్యాలయంలో ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కె రమాదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు ఏఐటియుసి జిల్లా కార్యదర్శి టి.కోదండయ్య, ఏఐటీయూసీ చిత్తూరు నగర కార్యదర్శి దాసరి చంద్ర లు మాట్లాడుతూ మే ఒకటో తారీఖున మే డే ను కార్మిక వర్గం పండుగ వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు మేడే చరిత్రను ప్రత్యేకతను నాయకులు వివరించారు. చిత్తూరు నగరంలోని ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు నాయకులు వారి యూనియన్ల వద్ద ఎర్ర తోరణాలు అలంకరించి ఎర్రజెండాను ఆవిష్కరించి కార్మికుల దినోత్సవం చరిత్రను కార్మిక వర్గానికి తెలియజేయాలని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండ కట్టడానికి, కార్మిక చట్టాలను హక్కులను కాపాడుకోవడానికి కార్మిక వర్గం పోరాటాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటియుసి గౌరవ సలహాదారులు కే.మణి, వి.సి.గోపీనాథ్, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు ఎం విజయ్ కుమార్, మురుగేష్, రజిని, మణి, వెంకటేష్, గోవిందస్వామి, డేవిడ్, కృష్ణ, లోకేష్, ఏసు, రవి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-కోట: కోటలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం తహసీల్దార్ జయజయరావు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయానికి ప్రతిదినం పలువురు రైతులు, ప్రజలవారి సమస్యలు పరిష్కరించుకునేందుకు కార్యాలయానికి రాకపోకలు సాగిస్తుంటారని ఈ క్రమంలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో వారిదాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అజంతుల్లా ఖాన్, ఆర్.ఐ మధులత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు అరికట్టడమే లక్ష్యంగా పని చేద్దాం

విశాలాంధ్ర-పాలసముద్రం: మత్తు పదార్థాలు అరికట్టడమే లక్ష్యంగా పని చేద్దామని తాసిల్దార్ అరుణకుమారి ఎస్సై చిన్న రెడ్డప్ప అన్నారు గురువారం నాడు రెవిన్యూ సిబ్బంది పోలీస్ సిబ్బంది తో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలై యువత బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని మనమందరం కలిసి మత్తు పదార్థాలను అరికట్టాలని వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించే బాధ్యత మనపై ఉందని అలాగే ఎటువంటి సమాచారం తెలిసిన వెంటనే రెవెన్యూ అధికారులకు కానీ పోలీస్ అధికారులకు తెలియజేయాలని వారన్నారు ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు పెయింటర్ కూలీ మృతి

విశాలాంధ్ర-పుత్తూరు: పట్టణంలోని స్థానిక ఆరేటమ్మ గిరిజన కాలనీకి చెందిన ధర్మరాజులు భీమయ్య కుమారుడు డి. హరి (30) వృత్తిరీత్యా పెయింటర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పెయింటింగ్ కులీ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం కూలి పనికి వెళ్లి తిరిగి వస్తుండగా వడదెబ్బకు గురై సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే స్థానికులు పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెయింటర్ హరికి భార్య, ఇద్దరు పిల్లలు బాలిక తొమ్మిదవ తరగతి చదువుతున్నది. కుమారుడు ఆరవ తరగతి చదువుతున్నారు. కుటుంబ యజమాని మరణించడంతో కుటుంబ సభ్యులు బాధ వర్ణనాతీతం ప్రభుత్వం స్పందించి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.

నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ కె.వి సురేంద్ర నాయుడు, ఎంజీఎం డాక్టర్ ఎ శ్రీనివాసులు, పి పి 2 ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, ఐదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ ట్రోఫీలను, గోల్డ్ మెడల్ లను బహుకరించారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు విచ్చేసి వేడుకను జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ కిరణ్ కుమార్ నాయుడు, ఇ కిట్ ఆర్ అండ్ డి డిపార్ట్మెంట్ అరబి, ఇ ఛాంప్స్ ఆర్ అండ్ డి డిపార్ట్మెంట్ నీలిమ, ఇ కిడ్స్ కోఆర్డినేటర్ వరలక్ష్మి, ఇ ఛాంప్స్ కోఆర్డినేటర్ దాక్షాయిని, నారాయణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీజీ సంపత్ కుమార్, ఏవో వి రాజేష్, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మ విశ్వాసం మరింత పెంపు

మార్షల్ అకాడమీని ప్రారంభించిన ఎమ్మెల్యే అమర్

విశాలాంధ్ర-పలమనేరు: శారీరక మానసిక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేర్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గురువారం ఆయన వీకే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందిన పలువురు చిన్నారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో క్రీడలతోపాటు మార్షల్ ఆర్ట్స్ పై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా ఆడపిల్లలకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు చిన్నప్పటి నుంచే మార్షల్ ఆర్ట్స్ పై మక్కువ పెరిగేలా చూడాలని తద్వారా వారికి ఆరోగ్యంతో పాటు పలు అంశాలలో అవకాశాలు లభించేందుకు వీలుంటుందన్నారు. ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పలమనేరు బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వి బాలాజీ, ఆర్బిసి కుట్టి, గిరిబాబు, ఖాజా, నాగరాజు, మదన్, కిరణ్, శ్రీధర్, రమేష్, సురేష్ సుధాకర్, మోహన్, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు చేసిన సర్పంచ్

విశాలాంధ్ర-పలమనేరు: మండలం లోని కొలమాసనపల్లి గ్రామ సర్పంచ్ గోవింద స్వామి ఆధ్వర్యంలో గ్రామంలోని నెల్లిపట్ల రోడ్డు క్రాస్ వద్ద చలివేంద్రాన్ని గురువారం ఏర్పాటు చేశారు. వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా మంచినీరు, మజ్జిగను అందుబాటులో ఉంచినట్లు సర్పంచ్ గోవింద స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఎంపీడీవో ఖాదర్ భాష, ఈవోఆర్డి రాజేంద్ర బాలాజీ, సెక్రెటరీ సుబ్రమణ్యం, వీరభద్ర, గ్రీన్ అంబాసిడర్స్ పాల్గొన్నారు.

వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన నేదురుమల్లి

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి అవిశ్వాస తీర్మానంలో గెలిచినందుకు వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి అభినందనలు తెలిపారు. వైఎస్ఆర్ సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి మరియు వైఎస్ జగన్మోహన్ రెడ్డి, నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవం

విశాలాంధ్ర-పలమనేరు: పట్టణంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గాంధీనగర్ అంగన్వాడి కేంద్రం నందు పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమాన్ని అంగన్వాడి వర్కర్ సుబ్బమ్మ అధ్యక్షతన నిర్వహించినట్లు ఐ సి డి ఎస్, సిడిపిఓ ఇందిర ప్రియదర్శిని, సూపర్వైజర్ నజ్మా గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సిడిపిఓ, సూపర్వైజర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు ప్రతి అంగనవాడి కేంద్రంలో నిర్వహించి అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి, గర్భవతులకు బాలింతలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం వెయ్యి రోజులు సంరక్షణపై శ్రద్ధ వహించుట, లబ్ధిదారులు స్వయంగా కేంద్రంలో నమోదు చేసుకునే విధానం గురించి, పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి, పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి అంగన్వాడి వర్కర్లకు, స్థానికులకు, గర్భవతులు బాలింతలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇక్కడ చెప్పే విషయాలను శ్రద్ధగా గ్రహించి ఆయా అంగన్వాడి కేంద్ర పరిసరాల్లో ఉన్న గర్భవతులు బాధితులకు, పిల్లలకు అర్థమయ్యేటట్లు చెప్పాలన్నారు . ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు శాంతి, చిలకమ్మ, లోహిత, మహేశ్వరి, లత, భాగ్యలక్ష్మి, స్వాతి, మమత గర్భవతులు, బాలింతలు, తల్లులు మరియు మెప్మా అధికారులు పాల్గొన్నారు.

మానవ హక్కుల ఆధ్వర్యంలో కులాంతర వివాహం

విశాలాంధ్ర-పలమనేరు: జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో గురువారం బంగారుపాలెం మండలం మొగిలి ఈశ్వరుని దేవాలయంలో కులాంతర వివాహం జరిపించినట్లు మానవ హక్కుల సంస్థ జిల్లా అధ్యక్షులు డి.వి .మునిరత్నం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంగవరం మండలం దిగువ గొర్రెల దొడ్డి గ్రామం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నారాయణప్ప కుమారుడు మంజునాథ్, పెద్దపంజాణి మండలం శంకర్ రాయల్ పేట(మాడి) గ్రామానికి చెందిన రెడ్డప్ప కుమార్తె శాంభవి, కులాలు వేరైనా ఒకరినొకరు ప్రేమించుకున్నారని తెలిపారు. అబ్బాయి కుటుంబీకులు వివాహానికి ఒప్పుకున్న, అమ్మాయి కుటుంబీకులు మాత్రం నిరాకరించడంతో ఇరువురు పెళ్లి చేసుకుందామని ఇంటి నుండి వెళ్లిపోయి బెంగళూరులో ఉన్న గొర్రె దొడ్డి గ్రామానికి చెందిన రాజేంద్రను ప్రేమికులు ఆశ్రయించారన్నారు. అతను వీరి ప్రేమను ఎలాగైనా గెలిపించాలనే సంకల్పముతో జాతీయ మానవ హక్కుల సంస్థను ఆశ్రయించారు అన్నారు. ప్రేమికులిద్దరూ మేజర్లు కాబట్టి మానవ హక్కుల నాయకులు పలమనేర్ డి.ఎస్.పి ని సంప్రదించగా ఆయన గంగవరం సిఐ ప్రసాద్ వద్దకు వెళ్లాలని ఆదేశించారు అన్నారు. సీఐ ప్రసాద్ ఇరువురు తల్లిదండ్రులను స్టేషన్కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి ఇద్దరు మేజర్లు కాబట్టి నిర్ణయాధికారం వాళ్లకే ఉందని సామరస్యంగా సర్దుబాటు చేసుకోవాలని ఇరు వర్గాలకు సూచించారన్నారు. అనంతరం మానవ హక్కుల నాయకులు చొరవతో గురువారం ప్రేమికులకు ముందుండి వివాహాన్ని జరిపించా మన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల నాయకులు, మణి, సాంబశివ, మహిళా నాయకులు సరస్వతి, చంద్రకళ, రత్నమ్మ, శ్రీనివాసులు, మురళి, గుర్రం సుబ్రహ్మణ్యం, శివ, బంధువులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌బి మెడికేర్‌ను సందర్శించిన సిపిఐ నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి తిలక్ రోడ్డులో గల ఎస్ఎస్‌బి మెడికేర్ సంస్థను సి.పి.ఐ. జాతీయ కార్యవర్గ సభ్యుడు డా. కె.నారాయణ సందర్శించిన్నారు, వారికి ఎస్ఎస్‌బి మెడికేర్ అధినేత కె.వి. చౌదరి, లోకేష్ చౌదరి పుష్పగుచ్ఛముతో స్వాగతం పలికి, శాలువతో సన్మానించిన్నారు. ఈ సంధర్భముగా నారాయణ మందుల షాపు వివరాలు అడిగి తెలుసుకున్నారు. తగ్గింపు (డిస్కౌంట్) ధరలతో ప్రజలకు సేవచేయడం మంచిదే, అదేవిధముగా జనరిక్ మందులు మరింత తక్కువ ధరలకు ప్రజలకు అందజేయాలని సూచించారు. జనరిక్ మందుల ప్రభుత్వం ఆదరించాలని కోరారు. పేదలకు జనరిక్ మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అన్ని మెడికల్ షాపుల్లో జనరిక్ మందులు. ఎస్‌బిబి కేర్ మెడికల్‌లో సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధరలు ఉన్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు హాజరయ్యారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా వ్యవసాయ పనిముట్లు పంపిణీ

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణంలోని వ్యవసాయం మార్కెట్ కమిటీ కార్యాలయం నందు వ్యవసాయ యాంత్రీకరణ పథకం లో భాగంగా రాయితీపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ కార్యక్రమంలో సూళ్లూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యురాలు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల కాలంలోనే పీఎం కిసాన్ ద్వారా 6000 రూపాయలు చొప్పున ఈ సూళ్లూరుపేట డివిజన్ నందు 10,240 మంది రైతులు లబ్ధి పొందారని, అదేవిధంగా ఎలక్షన్ లో వచ్చిన హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం కింద మరో 14 వేల రూపాయలు త్వరలోనే మే నెల నుంచి అందిస్తారని, గత నవంబర్ డిసెంబర్ లో కురిసిన అకాల వర్షాలకు ఎన్నడూ లేని విధంగా 20043 హెక్టార్లలో వేసిన వరి పైరుకు 38 లక్షల 42 వేల రూపాయలు పంటల బీమా పథకం ద్వారా చెల్లించారని, అదేవిధంగా ఈరోజు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 126 మంది రైతులకు స్ప్రేయర్లు రోటవేటర్లు మరియు ట్రాక్టర్ తో నడిచే యంత్ర పరికరాలు యొక్క సబ్సిడీ విలువ 18,75,000తో అందించడం జరుగుతుందని తెలిపారు. ఇది అంతా రైతులపై తెలుగుదేశం పార్టీకి ఉండే అభిమానం అని మాన్య ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు సుపరిపాలనకు చిహ్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, సూళ్లూరుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్, సూళ్లూరుపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొక్కు శంకరయ్య, దొరవారిసత్రం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, ఎ.జి.కిషోర్, ఇట్టగుంట రత్నయ్య, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

విశాలాంధ్ర-పలమనేరు: పలమనేరు డివిజన్ పరిధిలో ఉన్న ఏడు మండలాల వ్యవసాయ అధికారులు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో చిత్తూరు జిల్లా వ్యవసాయ అధికారి మురళి కృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రి మన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో ఒకటి నుంచి ఐదు సంవత్సరాలు మరియు ఒక సంవత్సరం ఖాళీగా ఉన్నా బీడు భూములలో రైతులందరినీ ప్రోత్సహించి ఖచ్చితంగా వేయించాలని, అదేవిధంగా విత్తనం నుంచి విత్తనం వరకు ప్రకృతి వ్యవసాయం చేసేటటువంటి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చి వారి సంఖ్యను పెంచి ఎక్కువ మొత్తంలో ఈ ప్రకృతి వ్యవసాయం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, మరి ముఖ్యంగా పశుగ్రాసం కొరకు రైతులు ఎక్కువగా యూరియా వాడుతున్నారని కావున పసుగ్రాసాన్ని ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేసి యూరియా వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, నాన్ పెస్టిసైడ్ మేనేజ్మెంట్ షాపులను కూడా ఎక్కువ మొత్తంలో పెట్టి రైతులకు, ద్రవ జీవామృతం, పంచంగవ్య, ఇతర కషాయాలు కూడా తయారు చేసి అందజేయాలని, తద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయాన్ని చేసుకునే అవకాశం ఉంటుందని, అలాగే కిచెన్ గార్డెన్స్ మరియు ఏటీఎం, ఎ గ్రేడ్ మరియు ఇతర ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులందరికీ కూడా తెలియజేసి వీటిని పాటించే విధంగా తగిన చర్యలు తీసుకుని, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ రెడీ చేసుకుని దాన్ని బాగా అమలుచేసి ఇచ్చిన టార్గెట్లను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలనిప్రకృతి వ్యవసాయ సిబ్బందినీ ఆదేశించారు. తర్వాత ఏడు మండలాల వ్యవసాయ అధికారులుతో సమీక్ష నిర్వహిస్తూ యాంత్రికరణ పథకం కింద ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చేయాలని, పీఎం కిసాన్ 20 వ ఇన్స్టాల్మెంట్ పడాలంటే భూమి ఉన్న ప్రతి ఒక్క రైతు కూడా ఏపీఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, కిసాన్ డ్రోన్ పథకం గురించి మరియు ఇతర పథకాలన్నీ కూడా నిర్దేశించి సమయంలోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

తదుపరి పలమనేరు మండలంలో కూర్మాయి గ్రామంలో దేశియా వరి వంగడాలు పండిస్తున్న చండూల్ కుమార్ రెడ్డి పొలం పరిశీలించారు మరియు ప్రకృతి వ్యవసాయ విధానంలోవారు సాగు చేసిన 40 రకాల టమాటో విత్తన నిల్వలను పరిశీలించారు. భూమి ఆగ్రో బయో ఫ్యూచర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ కొలమాసానపల్లిలో తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ముడిసరుకులను పరిశీలించారు.

కార్యక్రమంలో ఏడు మండలాల వ్యవసాయ అధికారులు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని గరుడసేవ

విశాలాంధ్ర-తిరుపతి: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం రాత్రి 7 గంటలకు గరుడ వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులకు అభయమిచ్చారు. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. గరుత్మంతుడు శ్రీమహావిష్ణువుకు నిత్యవాహనం. దాసుడుగా, సఖుడుగా, విసనకఱ్ఱగా, చాందినిగా, ఆసనంగా, ఆవాసంగా, వాహనంగా ధ్వజంగా అనేక విధాల సేవలందిస్తున్న నిత్యసూరులలో అగ్రగణ్యుడైన వైనతేయుడు కోదండరామస్వామిని వహించి కదిలే తీరు సందర్శనీయమైనది. 108 దివ్య దేశాలలోనూ గరుడ సేవ విశిష్టమైనది. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జిల్లాలో నీటి సమస్యపై ఫిర్యాదులు రాకూడదు

డిఈలు, ఏఈలు గ్రామాలలో పర్యటించాలి: కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర -చిత్తూరు: వేసవిలో త్రాగునీటి సమస్య లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు.గురువారం ఉదయం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్ నందు జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ ఈ.విజయకుమార్,జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావ్ తో కలిసి వేసవి లో త్రాగునీటి సమస్య లేకుండా తీసుకోవలసిన ముంద స్తు చర్యలు పై గ్రామీణ నీటి సరఫరా శాఖ డిడిలు, ఏఈ లతో సమీక్ష సమావేశంనిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ వేసవిలో త్రాగునీటి సమస్య లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు ఇవ్వాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి క్లీనింగ్ చేయాలని క్లీనింగ్ చేసే సమయంలో ఫోటోలు తీసి జిల్లా కలెక్టర్ పంపించాలన్నారు. అదేవిధంగా త్రాగునీటి పైపులు లీకేజీ ఉన్న వాటిని వెంటనే రీప్లేస్మెంట్ చేయాలన్నారు. డీ ఈ లు వారి పరిధిలోని మండలాల్లో పర్యటించి గ్రామాలలో నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఏఈలు మండల పరిధిలోని పంచాయతీ సెక్రెటరీ తో సమయం చేసుకొని ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయించాలని, తాగునీటి సరఫరా అయ్యే పైప్ లు మరమ్మత్తులకు గురి అయితే మురుగు నీరు కలసి కలుషితంతో రకరకాల వ్యాధులు వచ్చే అవకా శం ఉన్నందన్నారు. నిరంతరం త్రాగునీటిని ల్యాబ్ లకు పంపిచిచి టెస్టింగ్ చేయించాలన్నారు. ఏఈలు, పంచాయతీ సెక్రెటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమన్వయం తో పని చేయాలన్నారు.15 ఆర్థిక సంఘ నిధులతో చేసి పనులకు సంబంధించి బిల్స్ ను వెంటనే జడ్పీ కి పంపించాలన్నారు.జడ్పీలో బిల్స్ వెంటనే క్లిరిన్స్ చేయాలని జడ్పీ ఏ ఓ ను ఆదేశించారు. అవదరమైన చోట బోర్లు వేసి ఉంటే మోటర్లు బిగించి వెంటనే విద్యుత్ శాఖ అధికా రులతో మాట్లాడి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. విద్యుత్ శాఖ ద్వారా ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురా వాలన్నారు. జిల్లాలో గత 15 రోజుల వ్యవధిలో లీకేజీ అయిన 105 పైపులను గుర్తించి వెంటనే 105 లీకేజీ పైపులను సరిచేయడం జరిగిందని, 185 పంపు సెట్ లు మరమ్మత్తులను గుర్తించి 185 పంపు సెట్ లకు మరమ్మత్తులు చేపట్టామన్నారు.2024 సంవత్స రంలో ట్రాన్స్ పోర్టేషన్ ద్వారా 95 హ్యాబిటేషన్ లకు నీటి సరఫరా చేపట్టామని, గత 15 రోజులలో 17 గ్రామాలలో ట్రాన్స్పోర్టేషన్ చేయడం జరిగిందని, సి పి డబ్ల్యు ఎస్ ద్వారా విజయపురం,నింద్ర మండలాలలో 44 హ్యాబిటేషన్స్ లోని 21722 జనాభాకు త్రాగునీరు ఇవ్వడం జరుగుతుందని ఎస్ ఈ జిల్లా కలెక్టర్ కు వివరించారు.ఈ సమావేశంలో జడ్పీ ఏ ఓ, జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ డిఈలు,ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ఎంపీ కృషిని కొనియాడిన చిత్తూరు కూటమి నేతలు

విశాలాంధ్ర - చిత్తూరు: తిరుపతి కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్ కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో పాటు రైల్వే డబుల్ లైన్ ఏర్పాటుకు 1332 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సియా రాజన్ , మాజీ ఎమ్మెల్సీ దొరబాబు జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ లు కృతజ్ఞతలు తెలిపారు.తిరుపతి కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్ కు ఆమోద ముద్ర వేయడానికి కారణమైన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు చొరవ, కృషిని కొనియాడారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమినేతలు విలేకరులతో మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పెండింగ్ లోఉన్న తిరుపతి కాట్పాడి డబుల్ లైన్ మంజూరులో చిత్తూరు ఎంపీ కీలకపాత్ర వహించారని, ఆయన కృషికి నేడు ఫలితం దక్కిందన్నారు. దీనివల్ల చిత్తూరు జిల్లా అనేక రకాలుగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. దీంతో వ్యాపారస్తులకు రైతాంగానికి ప్రయాణికులకు అనేక ప్రయోజనాలు చేకూరి అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఏకకాలంలో ఈ పనుల కోసం1332 కోట్లు కేటాయించడం గొప్ప విషయమని చెప్పారు. జిల్లా బిజెపి అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో దీనిపై ఎవరు శ్రద్ధ చూపలేకపోయారని, బిజెపి పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి తో పాటు చిత్తూరు పార్లమెంటు సభ్యులు ప్రసాదరావు ప్రత్యేక చొరవ చూపడంతో ఈ డబుల్ లైన్ ఏర్పాటుకు మార్గం సులభతరమైందన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు పార్లమెంటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏకాంతసేవతో ముగిసిన శ్రీరామనవమి బ్రహ్మోత్సవం

విశాలాంధ్ర - చిల్లకూరు: తమ్మినపట్నం శ్రీకోదండరామ స్వామి బ్రహ్మోత్సవం 7వరోజు మరియు ఆఖరిరోజు గురువారం ఉదయం స్వామి వారికి పూలాంగి సేవ కార్యక్రమం అత్యంత వైభవంగా ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయంత్రం డోలోత్సవం మరియు ఏకాం తసేవ పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పోటెత్తారు. కార్యక్రమాలకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఛైర్మన్ కోట సతీష్ యాదవ్, కమిటీ సభ్యులు మరియు ఆలయ కార్యనిర్వహణాధికారి వి. గిరిక్రిష్ణ తమ సిబ్బందితో కలసి అన్ని చర్యలు తీసుకున్నారు. చిల్లకూరు పోలీసు వారు శ్రీరామనవమి ఉత్సవాలు జరిగిన 7 రోజులు ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసు కున్నారు. శ్రీరామనవమి ఉత్సవాలు విజయవంతంగా జరగడం పట్ల కమిటీ ఛైర్మన్ కోట సతీష్ యాదవ్ మరియు ఇవో గిరిక్రిష్ణ ఆనందం వ్యక్తం చేశారు. సతీష్ యాదవ్ మాట్లాడుతూ తమ్మిన పట్నం గ్రామంలో ఉత్సవాలు జరిగిన అన్ని రోజులు మద్యం మరియు మాంసం జాడ లేకుండా కఠిన చర్యలు తీసుకోవడం జరిగింది అని సహకరించిన గ్రామ ప్రజలకు మరియు ప్రతి ఒక్కరికీ నమస్సులు తెలియచేసారు. తెలిసి లేక తెలియక యేమైనా పొరపాటు జరిగి ఉంటే భవిష్యత్తు లో ఆ పొరపాటు జరగకుండా కార్యక్రమాలు నిర్వహించి ముందుకు పోతామన్నారు.

మాజీ ఉపరాష్ట్రపతి తిరుపతి పర్యటన ఖరారు

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తిరుపతి పర్యటన ఖరారైనట్లు, పూర్వ ఉపరాష్ట్రపతి కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేసింది. ఏప్రిల్ 12, 13 తేదీల్లో ఆయన తిరుపతిలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఏప్రిల్ 12 ఉదయం హైదరాబాద్ నుంచి బయలు దేరి ఉదయం 7.45 కు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోనున్నారు. ఉదయం 10-00 గంటలకు తిరుపతి లోని కచ్చపి ఆడిటోరి యంలో "ఒకే దేశం - ఒకే ఎన్నిక" సెమినార్ లో ప్రసంగిస్తారు. సాయంత్రం 5-00 గంటలకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో హాస్టల్ బిల్డింగ్ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 6-00 గంటలకు జాతీయ సంస్కృత విద్యాలయంలోని ఇండోర్ ఆడిటోరియంలో గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ సంస్మరణ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఏప్రిల్ 13వ తేదీ ఉదయం 8-20 నిమిషాలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాద్ తిరుగు ప్రయాణం వెళ్లనున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

విశాలాంధ్ర -చిత్తూరు : చిత్తూరు నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే అభివృద్ధి పనులను చేపట్టి. పూర్తిచేసి, ప్రారంభోత్సవాలు చేస్తున్నామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. గురువారం నగరపాలక పరిధిలోని లాయర్స్ కాలనీ, ఎస్పీ బంగ్లా రోడ్డులో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. 4వ వార్డు పరిధిలోని లాయర్స్ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, కాలువను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి తగిన ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. లాయర్స్ కాలనీ ప్రజలు, కాలనీ అసోసియేషన్ వినతి మేరకు సిమెంట్ రోడ్డు, కాలువ నిర్మించామని. మిగిలిన పనులను రాబోయే రెండు మూడు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. స్థానికంగా పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎస్పీ బంగ్లా రోడ్డులో వర్షపు నీటి ప్రవాహం కోసం రూ.25 లక్షలతో నిర్మించిన మేజర్ కాలువను ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, చుడా ఛైర్ పర్సన్ కఠారి హేమలత, సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, పరిశీలకులు సునీల్ కుమార్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్వో డా. లోకేష్, వార్డు ఇన్చార్జులు, పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

ఆర్థిక కమిషన్ 2 రోజులు పర్యటన ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : 16వ ఆర్థిక కమిషన్ ఈ నెల 17, 18 రెండు రోజులు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలి అని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు 16వ ఆర్థిక కమిషన్ పర్యటన ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్తో కలిసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో 16వ ఆర్థిక కమిషన్ రెండు రోజులు పర్యటించనున్నారని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని తెలిపారు. 17 వ తేది ఉదయం 11 గంటలకు ఆర్థిక కమిషన్ 15 మంది డెలిగేట్స్ తిరుపతి ఎయిర్పోర్ట్ కు చేరుకోనున్నారని, ప్రోటోకాల్, బందో బస్తు, సెక్యూరిటీ పగడ్బందీగా ఉండా లని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) రవి మనోహర చారి, డిఆర్ఓ నరసింహులు, జడ్పీ సీఈవో రవి కుమార్ నాయుడు, సిపిఓ ప్రేమ చంద్ తదితరులు పాల్గొన్నారు.